
విద్యార్థుల స్కూల్ ఫీజు చెల్లింపు



ఆల్విన్‌కాలనీ: ఎల్లమ్మబండలో నివాసం ఉండే కొత్తపల్లి యాదగిరి తన ఇద్దరు పిల్లల స్కూల్ ఫీజు చెక్కును గురువారం కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్, యువ నేత రామకృష్ణగౌడ్ అందజేశారు. డీవీజీ ట్రస్టు ద్వారా రూ.40వేల చెక్కును కాంగ్రెస్ నాయకులతో కలిసి స్కూల్ యాజమాన్యానికి అందజేశారు. ఈ కార్యక్రమంలో గుడ్ల శ్రీనివాస్, పోశెట్టి గౌడ్, యాదగిరి, సంగమేష్, అగ్రవాసు, నగేష్, సుధాకర్‌రెడ్డి, రాజు, తదితరులు పాల్గొన్నారు.

శ్రీరాముడి పట్టాభిషేకం





కూకట్‌పల్లి: కూకట్‌పల్లి శ్రీ పట్టాభి సీతారామ చంద్రస్వామి ఆలయంలో శ్రీ సీతారామ చంద్ర స్వామి వారి సామ్రాజ్య పట్టాభిషేక మహోత్సవం గురువారం అంగరంగవైభవంగా జరిగింది. ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు స్వామివార్లకు పట్టువస్త్రాలు సమర్పించారు.

అధికారుల విధులకు ఆటంకం

బిల్డర్లు, యజమానులపై కేసు నమోదు

మూసాపేట: రాఘవేంద్ర సొసైటీ కాముని చెరువు ఎఫ్‌టీఎల్ పరిధి బఫర్‌జోన్‌లో అక్రమ భవనం నిర్మిస్తున్న వ్యక్తులపై గురువారం నీటి పారుదల శాఖ అధికారులు కూకట్‌పల్లి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... రాఘవేంద్ర సొసైటీ కాముని చెరువు బఫర్‌జోన్‌లో అక్రమంగా భవనాన్ని నిర్మిస్తున్నారు. జీహెచ్‌ఎంసీ, ఇరిగేషన్, రెవెన్యూ అధికారులు కూల్చేందుకు వెళ్లగా కొంతమంది వ్యక్తులు, యజమానులు, బిల్డర్లు, అధికారుల విధులను అడ్డుకుని.. అక్రమ నిర్మాణాలను కూల్చివేయకుండా అడ్డుకున్నారు. వీరిలో ముగ్గురు బిల్డర్లు, నలుగురు యజమానులు ఉన్నారని అధికారులు తెలిపారు. అధికారులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు. అక్రమ నిర్మాణం, అధికారుల విధులకు ఆటంకం కలిగించినందుకు పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేశామని పోలీసులు తెలిపారు.



మోకాలి మార్పిడి శస్త్రచికిత్సలు విజయవంతం

కూకట్‌పల్లి: కూకట్‌పల్లిలోని ల్యాండ్‌మార్క్ ఆస్పత్రిలో మోకాలి మార్పిడి ఆగ్మెంటెండ్రియాలిటీ నేవిగేషన్ శస్త్ర చికిత్స విజయవంతం చేశారు. ఈ సందర్భంగా ఆస్పత్రి చీఫ్ శ్రీధర్‌రెడ్డి మాట్లాడుతూ.. ఇటీవల కాలంలో బాగా ప్రాచుర్యం పొందిన, అలవాటైన శస్త్ర చికిత్స మోకాలి మార్పిడి అన్నారు. ఈ శస్త్ర చికిత్సలు 95 శాతం విజయవంతం అవుతున్నాయని తెలిపారు. సుమారు 25 ఏళ్ల పాటు మార్చిన మోకాళ్లు బాగానే పనిచేస్తాయన్నారు. మన దేశంలో ఏడాదికి సుమారు 3 లక్షల మందికి మోకాలి మార్పిడి శస్త్ర చికిత్సలు జరుగుతున్నాయని తెలిపారు. ఆగ్మెంటెండ్రియాలిటీ నేవిగేషన్ శస్త్ర చికిత్స వల్ల ఖచ్చితంగా ఎలైన్‌మెంట్‌ను అంచనా వేయగలమన్నారు.

◆ ల్యాండ్‌మార్క్ ఆస్పత్రిలో తొలిసారిగా డాక్టర్ శ్రీధర్ రెడ్డి బృందం మోకాలి మార్పిడి ఆగ్మెంటెండ్రియాలిటీ నేవిగేషన్ శస్త్ర చికిత్స ఫిబ్రవరి 27న చేశామన్నారు. ఇప్పటి వరకు 70 శస్త్రచికిత్సలు ఈ టెక్నాలజీ ద్వారా విజయవంతంగా చేశామని తెలిపారు. 64 సంవత్సరాల ప్రసాద్‌రెడ్డి అనే వ్యక్తికి ఈ టెక్నాలజీ ఉపయోగించి రెండు మోకాళ్లకు శస్త్ర చికిత్సలు చేశామని పేర్కొన్నారు. రెండు రోజుల్లోనే ఆయన తన పనిని తాను చేసుకోగలుగుతున్నారని తెలిపారు. ఈ ఆపరేషన్ ద్వారా నొప్పి కూడా తక్కువగా ఉంటుందని తెలిపారు. అదే విధంగా 58 సంవత్సరాల సరోజ అనే మహిళకు కూడా శస్త్రచికిత్స చేశామన్నారు.



మోకాలి మార్పిడి చేయించుకున్న వారితో ల్యాండ్‌మార్క్ ఆస్పత్రి చీఫ్ శ్రీధర్‌రెడ్డి, వైద్యులు

ఈటల రాజేందర్‌ను గెలిపించుకుంటాం

పులిగొల్ల శ్రీనివాస్‌యాదవ్

మోతీనగర్: మల్కాజ్‌గిరి లోక్‌సభ బీజేపీ అభ్యర్థి ఈటల రాజేందర్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపిస్తామని బీజేపీ మేడ్చల్ జిల్లా కార్యదర్శి పులిగొల్ల శ్రీనివాస్‌యాదవ్ అన్నారు. గురువారం ఈటల రాజేందర్ నామినేషన్ వేసిన సందర్భంగా అల్లాపూర్ డివిజన్ కార్యకర్తలతో కలిసి రాజేందర్ నివాసానికి తరలి వెళ్లారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరిస్తూ ఓటు వేసే విధంగా ప్రతి కార్యకర్త కృషి చేయాలని సూచించారు. ఉద్యమకారుడు బడుగు బలహీన వర్గాల అండగా ఉంగే రాజేందర్‌ను గెలిపించుకునే బాధ్యత మనందరిపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో నార్లపురం శ్రీనివాస్, ఉప్పల దామోదర్ నేత, గోనెల సుదర్శన్‌ముదిరాజ్, బొంతు హరికృష్ణ, పి. శ్రీలక్ష్మి, అంకిత్, కమ్మరి కృష్ణ, దస్తయ్య తదితరులు పాల్గొన్నారు.



ఈటల రాజేందర్‌తో నామినేషన్ కార్యక్రమానికి తరలి వెళ్లిన పులిగొల్ల శ్రీనివాస్‌యాదవ్

ప్రతి కార్యకర్త కాంగ్రెస్ విజయానికి కృషి చేయాలి

కూకట్‌పల్లి పార్టీ ఇన్‌చార్జి బండి రమేష్

మోతీనగర్: బూత్ కమిటీ సభ్యుల నుంచి ప్రతి కార్యకర్త పార్టీ విజయానికి తప్పనిసరిగా కృషి చేయాలని కూకట్‌పల్లి కాంగ్రెస్ ఇన్‌చార్జి బండి రమేష్ అన్నారు. ఈనెల 19న జరగనున్న విస్తృతస్థాయి సమావేశం సందర్భంగా బుధవారం కేపీహెచ్‌బీ కాలనీలోని సితార హోటల్‌లో ముఖ్య నాయకులతో కూకట్‌పల్లి నియోజకవర్గ కోఆర్డినేటర్ వినయ్‌రెడ్డి సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా బండి.రమేష్ పాల్గొని మాట్లాడారు.బూత్ స్థాయిలో వీలైనంత త్వరగా కమిటీలు నియమించాల్సిన అవసరం ఉందన్నారు. నియోజకవర్గంలోని ప్రతి రెండు డివిజన్‌లకు కలిపి త్వరలో సమావేశం ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు.

◆ కోఆర్డినేటర్ వినయ్‌రెడ్డి మాట్లాడుతూ... మతపరంగా జనాభాను విడదీయటం అవసరం లేదని అది కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతం కాదన్నారు. ఏఐసీసీ ఆదేశాల మేరకు ప్రతి ఒక్క కార్యకర్త పనిచేయాలన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా పోరాడాలని సూచించారు. ఈ సమావేశంలో టీపీసీసీ కార్యదర్శి సత్యం శ్రీరంగం, ఏ బ్లాక్ అధ్యక్షుడు నాగిరెడ్డి, బీ-బ్లాక్ అధ్యక్షుడు తూము వేణు, సతీష్‌రెడ్డి, గొట్టిముక్కల వెంకటేశ్వరరావు, కొప్పిశెట్టి దినేష్ కుమార్, డివిజన్ అధ్యక్షులు, మహిళా నాయకులు పాల్గొన్నారు.



కాంగ్రెస్ ముఖ్య నాయకుల సమావేశంలో మాట్లాడుతున్న బండి రమేష్

ఈటల రాజేందర్‌కు శుభాకాంక్షలు



మూసాపేట: మల్కాజ్‌గిరి లోక్‌సభ బీజేపీ అభ్యర్థి ఈటల రాజేందర్ శామీర్‌పేట కలెక్టర్ కార్యాలయంలో బుధవారం నామినేషన్ వేశారు. ఈ సందర్భంగా మూసాపేట డివిజన్ అధ్యక్షుడు పిట్ల మనోహర్ ఆయనను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఆయనతో పాటు రాష్ట్ర నాయకులు నాగరాజు, సద్గుణరెడ్డి, ఎస్.కిషోర్‌కుమార్, శ్రీకాంత్, వాసవీ పాల్గొన్నారు.

వారంతపు సంత

మోతీనగర్: మూసాపేట డివిజన్ మోతీనగర్‌లో ప్రతి శుక్రవారం వారాంతపు కూరగాయల సంత జరుగుతుంది. ఈ సంతలో తాజా కూరగాయలు, పండ్లు, పూలు, నిత్యావసర వస్తువులు, గృహోపకరణాలు అందుబాటులో ఉంటాయి.

వైభవంగా విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలు

మోతీనగర్: అల్లాపూర్ డివిజన్ కొత్తూరు సీతయ్యనగర్‌లోని శ్రీరామాంజనేయ స్వామి దేవస్థానంలో విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. గురువారం విష్వక్సేరాధన, అగ్ని ప్రతిష్ఠ, ద్వారతోరణ, ధ్వజస్తంభారాధన, మూల మంత్ర హోమం, జలదివాస హోమం, పూర్ణాహుతి వంటి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

విషం తాగి యువకుడి ఆత్మహత్యాయత్నం

చికిత్స పొందుతూ మృతి



మృతుడు హరిశంకర్ అలియాస్ రాజు

మూసాపేట: కుటుంబ సమస్యలతో ఓ విషం తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. ఈ ఘటన కూకట్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో గురువారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... జనతానగర్‌కు చెందిన ఎస్.హరిశంకర్ అలియాస్ రాజు రాపిడో డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఇతడి తల్లి కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకురాలు. కుటుంబ సమస్యల వల్ల విషం తాగాడు. వెంటనే కుటుంబ సభ్యులు అంబులెన్స్‌లో గాంధీ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ రాత్రి 12.40 గంటలకు మృతిచెందాడు. అంబులెన్స్ వరకు నడుచుకుంటూ వెళ్లి ఎక్కిన హరిశంకర్ ఆరోగ్యంతో తిరిగి వస్తాడని స్థానికులు భావించారు. చనిపోయాడని తెలియడంతో స్థానికంగా విషాదఛాయలు అలుముకున్నాయి. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.





